జగనన్నకు మద్దతుగా నిలుద్దాం



ముగింపు సభలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో ఎమ్మెల్యే టీజేఆర్, ఎంపీపీ ఇతర నాయకులు



ఇనమనమెళ్లూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బూచేపల్లి వెంకాయమ్మతో ఎమ్మెల్యే, ఎంపీపీ తదితర నాయకులు

- జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన

మద్దిపాడు: ప్రతి క్షణం ప్రతి రోజూ ప్రజల గురించి ఆలోచిస్తూ వారి అభ్యున్నతికి ఏవిధంగా పాటు పడాలన్న తపనతో పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మళ్లీ సీఎంగా చేసుకుందామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. గురువారం ఇనమనమెళ్లూరులో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం ముగింపు సభలో మాట్లాడారు. ప్రజల సంక్షేమం ఆశించే ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే ఒక్క జగనన్నకే సాధ్యమైందన్నారు. గత ప్రభుత్వంలో రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు చాలా ఉన్నాయని చంద్రబాబు ప్రభుత్వం రైతులకు చేసింది ఏమీ లేదన్నారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో 84 సచివాలయాలుండగా చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల్లోని 80 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసుకున్నామని చెప్పారు. సంతనూతలపాడు మండలంలో కేవలం నాలుగు సచివాలయాల్లో 6 వేల గడపలు పూర్తి చేసుకుంటే ఇక గడప గడపకు మన ప్రభుత్వం అనే మహాయజ్ఞం పూర్తవుతుందన్నారు. మద్దిపాడు మండలంలో 16,156 గడపలు పూర్తిగా తిరిగామని, ఇనమనమెళ్లూరులోని 1270 గడపలు ఒకటిన్నర రోజులో పూర్తి చేసుకోగలిగామని వివరించారు. దీనికి సహకరించిన ఎంపీపీ వాకా అరుణకోటిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని మాట్లాడుతున్నారని ఒక్క ఇనమనమెళ్లూరులోనే వివిధ పనులకు 3.84 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసి ఆర్‌బీకే, గ్రామ సచివాలయం, వెల్ నెస్ సెంటర్, సీసీ రోడ్లు సైడు డ్రైన్లు నిర్మించామన్నారు. ఇది అభివృద్ధి కాదా అంటూ ప్రశ్నించారు. 2019 నుంచి ఇప్పటి వరకూ 14 కోట్ల రూపాయలు ఇనమనమెళ్లూరు గ్రామానికి వచ్చాయని ఇది సంక్షేమం కాదా అంటూ ప్రశ్నించారు. గ్రామంలో టీడీపీ నాయకులకు పథకాలు రాలేదని ఎవరైనా చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. అనంతరం ఆర్‌బీకే వెల్ నెస్ సెంటర్‌లను సంతనూతలపాడు శాసన సభ్యుడు టీజేఆర్ సుధాకర్‌బాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించగా సచివాలయాన్ని చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. ముందుగా అతిథులందరికీ ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యేను గుర్రంపై ఊరేగించారు. ముందుగా సెంటర్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. మండల కన్వీనర్లు మండవ అప్పారావు దుంపా చెంచిరెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, గ్రామ సర్పంచ్ ఏకుల ఏడుకొండలు జెడ్పీటీసీలు తేళ్ళ భాగ్యలక్ష్మిపుల్లారావు, దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారు బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, డైరెక్టర్‌లు కొలకలూరి విజయ్‌కుమార్, పేరాల చెన్నకేశవులు, సీనియర్ నాయకులు గట్టినేని అయ్యన్న, ఎర్ర దశరథ, మారెడ్డి వీరారెడ్డి, గుద్దపాతల రవి, మోరబోయిన సంజీవరావు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

- హాజరుకానున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ డెమక్రటిక్ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మీడియా ఫొటోగ్రాఫర్లు, వీడియో జర్నలిస్టుల సత్కారసభ నిర్వహించనున్నట్లు డివిజన్ అధ్యక్షకార్యదర్శులు పి.శ్రీనివాస్, జి.శివాజీలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సంతపేట ఆర్కిడ్స్ టెక్నో స్కూలులో శుక్రవారం ఉదయం నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, డీఎస్పీ వి. నారాయణస్వామి రెడ్డి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కె. సుశీల, చదలవాడ పశు క్షేత్రం డైరెక్టర్ డా.బి.రవి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. డిజిటల్ జర్నలిజం అవశ్యకత అనే అంశంపై సీనియర్ జర్నలిస్టు నందం నరేష్ ప్రసంగిస్తారని, మీడియో ఫొటోగ్రాఫర్లు, వీడియో జర్నలిస్టులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోండి



వివరాలు వెల్లడిస్తున్న జూలియన్, వెంగళరావు

చీమకుర్తి: ఆర్.ఎల్.పురం గ్రామానికి చెందిన సాదినేని అంజనీదేవికి ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూమిని మిడ్‌వెస్ట్ గ్రానైట్ యజమాని రాఘవరెడ్డి ఆక్రమించుకున్నారని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.జూలియన్, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు ఆరోపించారు. గురువారం చీమకుర్తి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు అంజనీదేవికి ప్రభుత్వం 1999లో ఆర్.ఎల్.పురం సర్వే నెంబర్ 103లో 3 ఎకరాల అసైన్డ్ భూమిని ఇచ్చినట్లు తెలిపారు. ఆ భూమిలో రాఘవరెడ్డి తన గ్రానైట్‌కు చెందిన రాళ్ళు స్టాక్ చేసి పెట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. దానిపై తహసీల్దార్ స్థానిక వీఆర్‌ఓను పంపించి సర్వే చేయగా ఆ భూమిలో రాఘవరెడ్డి తన క్వారీకి చెందిన గ్రానైట్ రాళ్ళుతో స్టాక్ చేసి పెట్టినట్లుగా నిర్ధారించారు. ఆభూమిని రాఘవరెడ్డి ఆక్రమించుకొని అంజనీదేవికి ఇవ్వకుండా స్వాధీనం చేసుకున్నందున రాఘవరెడ్డిపై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను వారితో పాటు అంజనీదేవి డిమాండ్ చేశారు.

చెన్నకేశవ స్వామికి ఎయిర్ కండిషనర్ బహూకరణ



ఎయిర్ కండిషనర్‌ను బహూకరిస్తున్న కరణం రాఘవరావు

ఒంగోలు మెట్రో: స్థానిక ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానానికి రాహుల్ సోషల్ వర్క్ ఫౌండేషన్ అధ్యక్షుడు కరణం రాఘవరావు రూ.50 వేల విలువ కలిగిన ఎయిర్ కండిషనర్‌ను బహూకరించారు. గురువారం ఉదయం దేవస్థానంలో జరిగిన ఈ కార్యాక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వాహణ అధికారి డి.రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, కరేటి కిరణ్ బాబులక ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కరణం రాఘవరావు మాట్లాడుతూ జిల్లాలో ఎంతో ప్రసిద్ధిగాంచిన ఈ దేవస్థానములో భక్తుల సౌకర్యార్థం ఏసీని స్వామి వారికి సమర్పించామన్నారు. భవిష్యత్తులో తమ ఫౌండేషన్ తరపున అనాథలు, వయోవృద్ధులు సంక్షేమానికి పాటుపడతామని ఆయన తెలిపారు. ఉపాధ్యాక్షులు పాలకొల్లు ప్రణీత్, దేవస్థాన అర్చక స్వాములు కేవిఎల్ శర్మ అవధాని, పి.రమనాధాచార్యులు, ఎం.త్రినాథ చక్రవర్తి, ఎస్‌వి.ఎస్ నాగార్జున దేవ్, ఎ.శ్రీధర్, వికె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులను దేవస్థానం తరపున ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.

దళిత కుటుంబానికి రక్షణ కల్పించాలి



దళిత మహిళ అనురాధను కలిసిన ప్రతినిధులు

ఒంగోలు టౌన్: కులాంతర వివాహం చేసుకున్న జక్కుల సాయిరాం కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించాలిన ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సాయిరాం తల్లి అనురాధను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చిలోనే జిల్లా ఎస్పీని కలిసి రక్షణ కల్పించాలిన కోరడంతో ఇరుకుటుంబాలను పిలిచి బైండోవర్ చేయించినట్లు వివరించారు. అయినప్పటికీ నిందితులు దాడికి తెగబడడం దారుణమన్నారు. మౌనికపై అత్యంత క్రూరంగా దాడి చేసిన నిందితులు ఎస్సై సమక్షంలోనే దళిత కుటుంబాన్ని చంపుతామని బెదిరించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అనురాధ కుటుంబానికి రక్షణ కల్పించాలని, ఆమె కూతురికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, దర్శిలో పక్కా గృహం నిర్మించి ఇవ్వాలని, రెండెకరాల పొలం కేటాయించి ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ, జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ పద్మ, వేణి, శాఖమూరి సీత తదితరులున్నారు.

ప్రచార పరిషత్ కార్యక్రమాలతో సంబంధం లేదు



శ్రీగిరి దేవస్థానం

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధార్మిక ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేకంగా శ్రీగిరి ధర్మ ప్రచార పరిషత్ ఉందని.. చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ధర్మకర్తల మండలి ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు సదరు కమిటీ నిర్వాహకులే బాధ్యులని దేవస్థానం బాధ్యత వహించదని ఝాన్సీరాణి వివరించారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి, ఇకపై కూడా శ్రీగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలితో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈబీసీ నేస్తం రైస్ షాపు ప్రారంభం

ఒంగోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈబీసీ నేస్తం ద్వారా లబ్ధిదారులకు రైసు షాపు గురువారం ప్రారంభమైంది. ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘ నాయకుడు పేరకం సుబ్బారావు రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు నాణ్యమైన సరుకును అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

యువతిని మోసం చేసిన యువకునిపై కేసు

మద్దిపాడు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకుని ముఖం చాటేసిన యువకునిపై మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. మద్దిపాడుకు చెందిన యువతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా హైదరాబాదులో గత రెండు సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తోంది. యువతి పెద్దమ్మ కందుకూరు మండలం ఇక్కిరాల పేటలో ఉంటుండగా ఆమె వద్దకు వెళ్లిన యువతికి.. అక్కడ వంశీకృష్ణ అనే సాఫ్ట్ వేర్ ఉద్యోగి పరిచయం కాగా అది ప్రేమగా మారింది. ఈక్రమంలో యువతి వివాహం చేసుకుందామని అడుగగా తన చెల్లి పెళ్లి తరువాత చేసుకుందామని వాయిదా వేస్తూ వచ్చాడని.. తనని శారీరకంగా వాడుకుని ఇప్పుడు పెళ్లి చేసుకోవడం లేదని తెలిపింది. మద్దిపాడు పోలీసులు వంశీకృష్ణపై కేసు నమోదు చేశారు.

విజ్ఞానం కోసం కన్స్యూమర్ క్లబ్‌లు

ఒంగోలు సిటీ: వినియోగదారులు నిత్య జీవితంలో ఎదుర్కొనే సమస్యలు, వినియోగదారులు మోసపోయినప్పుడు అనుసరించవలసిన పరిష్కార విధానాలు అనే అంశం పై ఉన్నత పాఠశాలల్లో కన్స్యూమర్ క్లబ్‌లు స్థాపించినట్లు జేసీ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. గురువారం ప్రకాశం భవనంలోని స్పందన హాలులో కన్స్యూమర్ క్లబ్‌లకు టీచర్ గైడ్ గా వ్యవహరించే ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఉన్నతపాఠశాలల్లో 8 మరియు 9 తరగతుల విద్యార్థులను భాగస్వాములను చేయడానికి తద్వారా విజ్ఞానాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి ఏపీ ప్రభుత్వం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసింది. జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ.ఉదయ్‌భాస్కర్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. సహాయ సరఫరా అధికారి ఐ.పుల్లయ్య, ఎన్‌ఫోర్సుమెంట్ డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంఘాలకు బ్యాంకు రుణాలు

తాళ్లూరు (ముండ్లమూరు): రైతు ఉత్పత్తిదారుల సంఘంలో ఉన్న రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బీ ప్రసాదరావు తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం ఏడు రైతు గ్రూపులకు రూ.35 లక్షల రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే ప్రథమంగా తాళ్లూరులో రైతుల కోసం బ్యాంకు రుణాలు ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మండలంలో 138 రైతు సంఘాలలో 1,794 మంది రైతులు సభ్యులుగా చేరడం జరిగిందన్నారు. వారిలో 9 నెలలు బ్యాంకులో పొదుపు కట్టిన రైతు సంఘాలకు మొదటిగా రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో వ్యవసాయ పెట్టుబడులకు ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎం దేవరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత



సెబ్ పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు

ఒంగోలు టౌన్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. సెబ్ పోలీసుల కథనం ప్రకారం.. సీఎస్‌పురం గ్రామానికి చెందిన పెన్నం దామోదర్ ఒంగోలు ఆర్టీసీలో బస్సు హెల్పర్‌గా పనిచేస్తుంటాడు. తెలంగాణకు చెందిన 100పైపర్స్ అనే 5 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా సెబ్ సీఐ బి.లత ఆధ్వర్యంలోని సెబ్ పోలీసు సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. ఈ దాడి లో సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎంపీ గోపాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, ఆర్టీసీ టీటీఐఎస్ ఆర్.వెంకటస్వామి, ఆర్.బాలరాజు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ప్రణీత్‌రెడ్డి, ఎంపీపీ అంజిరెడ్డి

గమళ్ళపాలెం (కొత్తపట్నం): ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు, యువ నేత బాలినేని ప్రణీత్‌రెడ్డి, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి గమళ్ళపాలెంలో గురువారం గ్రావెల్ రోడ్డు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్టీ కాలనీ నుంచి అల్లూరు వెళ్లే రోడ్డుకు టెంకాయలు కొట్టి పూజలు చేశారు. గ్రామంలో గ్రావెల్ రోడ్లు వేయాలని బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసికెళ్లారు. దీంతో ఆయన రూ.36 లక్షలు మంజూరు చేయించారు. ఎస్టీ కాలనీ నుంచి అల్లూరు పోవు రోడ్డు, గ్రామ సచివాలయం నుంచి బీచ్‌కి వెళ్లే గ్రావెల్ రోడ్ల పనులు ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు తాతా శ్రీనివాసరావు, బలగాని యానాదిరావు, ఉద్దగిరి జాలయ్య, తాతా నాంచార్లు, సుబ్రమణ్యం, తుళ్లూరి కోటయ్య, తుళ్లూరి వెంకటనారాయణ, జెట్టి హరిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



రక్తహీనతకు మందులు అందజేస్తున్న జెడ్పీటీసీ రత్నభారతి

నాగులుప్పలపాడు: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని జెడ్పీటీసీ యాదాల రత్నభారతి అన్నారు. గురువారం మద్దిరాలపాడు ప్రాథమిక పాఠశాల, చేకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎత్తు, బరువుకు సంబంధించి వివరాలను ఏఎన్‌ఎం చంద్రకళను అడిగి తెలుసుకొని రక్తహీనత ఉన్న వారికి మందులు అందజేశారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులతో కలిసి తిన్నారు. హెచ్‌ఎం రామారావు, అనిత, విద్యా కమిటీ చైర్మన్ మయూరి, పృధ్వీ రాజ్, ఆశ వర్కర్లున్నారు.

అసైన్డ్ భూములపై హక్కులు కల్పించాలి



సంతనూతలపాడు వద్ద ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

చీమకుర్తి: అసైన్డ్ భూములపై అర్హత కలిగిన పేదలకు హక్కులను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ధర్నా చేసి తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు ఇప్పటికే అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. అన్యాక్రాంతంమైన అసైన్డ్ భూములను తిరిగి అర్హత కలిగిన వారికే హక్కులను కల్పించాలని తెలిపారు. 9/77 చట్టం ద్వారా అనర్హులకు అసైన్డ్ భూములపై హక్కులను లేకుండా చేశారని, అనర్హులు దక్కించుకున్న భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కంకణాల ఆంజనేయులు, నెరుసుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు.

యూత్ రెడ్ క్రాస్ సభ్యులకు అభినందనలు



అభినందనలు తెలుపుతున్న చైర్మన్, వైస్ చైర్మన్ ప్రకాష్, వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ స్వతంత్ర దినోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ రెజిమెంట్ కవాతులో ప్రకాశం జిల్లా యూత్ రెడ్ క్రాస్ సభ్యులు ఫణీంద్రసాయి, ఆదికేశవరెడ్డి పాల్గొనగా ఉత్తమ రెజిమెంట్‌గా ఎన్నుకున్న యూత్ రెడ్‌క్రాస్ టీం సభ్యులకు రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ప్రశంసపత్రం, మెమొంటోలను పంపగా గురువారం న్యూరెడ్ క్రాస్ ఆవరణలో జరిగిన అభినందన సభలో రెడ్ క్రాస్ చైర్మన్ మాంటిస్సోరీ ప్రకాష్, వైస్ చైర్మన్ డా.వెంకటేశ్వర రెడ్డి టీం సభ్యులను అభినందించి ప్రశంసపత్రం, జ్ఞాపికను అందజేశారు. గత రెండేళ్లగా ఉత్తమ రెజిమెంట్‌గా ఎన్నిక అయిన యూత్ రెడ్‌క్రాస్ సభ్యులకు, వారికి శిక్షణ ఇచ్చిన పోలీసు సిబ్బందికి, జిల్లా రెడ్‌క్రాస్ తరపున చైర్మన్ మాంటిస్సోరి ప్రకాష్, వైస్ చైర్మన్ డా.వెంకటేశ్వర రెడ్డి, కార్యదర్శి, స్టెప్ సీఈఓ అభినందనలు తెలిపారు. మేనేజింగ్ కమిటీ సభ్యులు జనార్దన్, జిల్లా పర్యవేక్షకులు శ్రీనివాస్ స్టాన్లీలు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాత విలియం కేరి

ఒంగోలు టౌన్: భారత దేశంలో మొట్టమొదటిసారిగా ప్రింటింగ్ ప్రెస్‌ను నెలకొల్పి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన విలియం కేరి 262వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇంగ్లాండులో జన్మించినప్పటికీ దేశం మీద ప్రేమతో భారత దేశంలోని అన్ని భాషలను నేర్చుకున్నారని యాదాల అరుణ్ కుమార్ కొనియాడారు. దేశంలో అనేక కాలేజీలను, రైల్వే స్టేషను ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించిన కేరి నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. అనంతరం 200 మంది పేదలకు దుప్పట్లు, చీరలు, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి తేళ్ల రాజు అధ్యక్షత వహించగా భగవాన్ దాస్, కొల్లా సుబ్బారావు, పాడిబండ్ల వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు కోసం భూమి పూజ

ఒంగోలు రూరల్: కరవది గ్రామ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన భూమి పూజా కార్యక్రమం జరుగుతుందని ఆర్యవైశ్య సంఘ నాయకులు పేరకం సుబ్బారావు తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి భూమిపూజా కార్యక్రమంలో పాల్గొంటారని పేరకం సుబ్బారావు కమిటీ సభ్యులు తెలిపారు. రూరల్ మండలంలోని ఆర్యవైశ్య ప్రముఖులు ఈ కార్యక్రమానికి వచ్చి జయప్రదం చేయాల్సిందిగా వారు కోరారు. ఈ మేరకు గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ప్రకటన

నా క్లయింటు రావిపాటి పద్మాకుమారి భర్త వెంకటరావు ఒంగోలు అనువారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది.

నా క్లయింటు తన Orginal Condtional Sale Deed తేది : 31-07-2010 DNo 12198/2010 తీసుకొని మంగమూరు రోడ్డు Xerox Shop కి పోయి Xerox తీసుకొని తిరిగి యింటికి వెళ్ళిచూచుకొనగా పై Sale Deed లో 14వ Page Miss అయినది. తిరిగి వెళ్ళి ఎంత వెతికినను దొరకలేదు. ఈ విషయం తేది : 16-08-2023న జరిగినది ఎవరికైనను దొరికిన యెడల క్రింది అడ్రస్‌కు తెలువవలెను.

ఒంగోలు
తేది : 16-08-2023

R.V.S భరద్వాజ, లాయర్,
ఒంగోలు, 9493781705

క్లుప్తంగా

తాలూకా సీఐగా భక్తవత్సల రెడ్డి



భక్తవత్సల రెడ్డి

ఒంగోలు టౌన్: తాలుకా సీఐగా పి.భక్తవత్సల రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా నరసారావు పేట రూరల్ నుంచి ఆయన ఒంగోలు తాలుకాకు బదిలీ అయ్యారు. కాగా ఆయన గతంలో ప్రకాశం జిల్లాలో మద్దిపాడు, ఒంగోలు వన్‌టౌన్, ఒంగోలు ట్రాఫిక్ ఎస్సైగా విధులు నిర్వహించారు.

విద్యావ్యాపారానికి వ్యతిరేకంగా పోరాటం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చీమకుర్తి: విద్యావ్యాపారానికి వ్యతిరేకంగా పోరాటం సాగిద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలకు ఆంజనేయులతో పాటు జిల్లా కార్యదర్శి వినోద్, మండల కార్యదర్శి దేవరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నూతన విద్యావిధానం పేరుతో కేంద్రం విద్యను కాషాయీకరణ పరం చేస్తుందని ధ్వజమెత్తారు. ప్రతి ఒక్కరికీ విలువలతో కూడిన విద్య, ఉద్యోగ, ఉపాధి రంగంలో అవకాశాలను కల్పించేందుకు ఎస్ఎఫ్ఐ సాగించే పోరాటానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

నగదు లావాదేవీలు సక్రమంగా జరగాలి



మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ విజయమ్మ, ప్రక్కన ఏపీఎం గోపీనాథ్

ఒంగోలు రూరల్: మండలంలోని డీఆర్‌డీఏ రూరల్ మహిళా సమాఖ్య భవనంలో వీవో ఏలు స్వయం సహాయక సభ్యులు డ్వాక్రా మహిళల వర్క్ షాపు గురువారం జరిగింది. మండల సమాఖ్య అధ్యక్షురాలు సంధ్యారాణి అధ్యక్షత వహించగా ఏరియా కోఆర్డినేటర్ విజయమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కన్వీనర్‌గా ఒంగోలు ఏపీఎం గోపీనాథ్ వ్యవహించారు. ఈ వర్క్‌షాపులో ఏసీ మాట్లాడుతూ స్వయం సహాయక సభ్యులు వీవోఏలు డ్వాక్రా మహిళల నుంచి లావాదేవిలు పూర్తి స్థాయిలో నగదు రహితంగా జరగాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నుంచి బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు అందే వివిధ పథకాల సొమ్మును వారి వారి అకౌంట్‌లకు బదిలీ చేయించాలని కోరారు. రుణాల రికవరీలు సంబంధిత స్వయం సహాయక సంఘాలు శ్రీనిధి, ఎస్సీ ఎస్టీ ఉన్నతి పథకాలలో సొమ్ము వారి వారి ఖాతాల్లో జమ చేయాల్సిందిగా ఆదేశించారు. సంఘ ఖాతాలో జమ చేసిన ఆన్‌లైన్ ద్వారా జమ చేయడం ద్వారా ఆర్థిక పారదర్శకత ఏర్పడుతుందని తద్వారా లబ్ధిదారులకు అపోహలు, ఆర్థిక సమస్యలు తలెత్తవన్నారు. గ్రామ స్థాయిలో సంఘాలు, స్వయం సహాయక సంఘాలు వేగంగా ఆడిట్ లు పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా మహిళలు, ఏవోఏలు పాల్గొన్నారు. సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ మేనేజర్ పద్మావతి, డీఎంజీ వెంకట సుబ్బయ్య, సీసీలు రమణయ్య, చెంచులక్ష్మి, సామ్రాజ్యం పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 205 మందికి పరీక్షలు

పెద్దదోర్నాల: మండల పరిధి చింతల గిరిజన గూడెంలో గురువారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వైద్య శిబిరంలో 205 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఐటీడీఏల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరంలో ఒంగోలుకు చెందిన కిమ్స్ హాస్పటల్, సాయి వీణ చిల్డ్రన్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు. 205 మందికి వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. రక్తహీనత ఉన్న రోగులకు ప్రోటీన్ పౌడర్, ఐరన్ సిరప్‌లు పంపిణీ చేశారు. గర్భిణులకు ఐరన్ సిరప్‌లు పంపిణీ చేశారు. చింతల సర్పంచ్ భూమని వెంకటయ్య, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ కిరణ్‌కుమార్, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సోమశేఖర్, డాక్టర్ యగ్నిక్, వెంకట్రావ్, హెప్సిబా, ఆరోగ్య మిత్రలు దర్శనం రాంబాబు, మందగిరి చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ భరత్ భూషణ్, ఐటీడీఏ కో ఆర్డినేటర్ మంతన్న పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

దర్శి: మండలంలోని బొట్లపాలెం గ్రామంలో గల ఓ రెస్టారెంట్‌లో అక్రమంగా అమ్ముతున్న మద్యం బాటిళ్లను ఎస్సై రామకృష్ణ స్వాధీనం చేసుకున్నారు. 71 బీరు బాటిళ్లు, 182 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.